క్లుప్తంగా

శ్రావ్యంగా గాత్ర కచేరీ


గాత్ర కచేరీలో మణిమారన్

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అకాడమీ 55వ వార్షిక సంగీతోత్సవంలో భాగంగా రెండో రోజు బుధవారం చెన్నైకి చెందిన గాత్ర విద్వాంసుడు మణిమారన్ గాత్ర సంగీత కచేరీ శ్రావ్యానందకరంగా సాగింది. కచేరికి వాయులీనం మీద మావుడూరి సత్యనారాయణశర్మ, మృదంగంపై వంకాయల వెంకటరమణ, ఘటం మీద విద్వాన్ హరిబాబులు సహకారమందించారు. సంగీత సభకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాయోజకత్వం వహించింది.

మేధో సంపత్తి హక్కులపై సదస్సు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ గాయత్రి విద్యా పరిషత్ కళాశాలలో బుధవారం మేధోపరమైన హక్కుల సాధనపై సదస్సు నిర్వహించారు. ఐపీఆర్ బేసిక్స్ : ఎంపవరింగ్ ఇన్నోవేటర్స్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్ ఇన్నోవేషన్ అంశంపై వక్తలు ప్రసంగించారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్నోవేషన్ కౌన్సిల్(ఐఐసీ), ఏఐసీటీఈ, నేషనల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో కళాశాల బయోటెక్నాలజీ డిపార్ట్‌మెంట్ ఈ సదస్సు ఏర్పాటు చేసినట్లు బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ హిప్సిబా రాణి సింగ్ తెలిపారు. మేధో సంపత్తి హక్కుల(ఐపీఆర్) ప్రాముఖ్యత, వినియోగం, విద్యార్థుల పాత్రను వివరించారు. కార్యక్రమంలో పలువురు కళాశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

1న రౌండ్ టేబుల్ సమావేశం

మద్దిలపాలెం: గత రాష్ట్ర ప్రభుత్వం రుషికొండపై నిర్మించిన భవనాల వినియోగం అనే అంశంపై డిసెంబర్ 1న రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు సమావేశ కన్వీనర్ ఎస్.పి.రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విశాఖ పౌర గ్రంథాలయం హాల్‌లో ఉదయం 10 గంటలకు మొదలయ్యే ఈ సమావేశంలో ప్రముఖుల అభిప్రాయ సేకరిస్తామని తెలిపారు. వాటిని ప్రభుత్వ పరిశీలనకు నివేదిస్తామన్నారు. రౌండ్ టేబుల్ సమావేశంలో ఆచార్య బాలమోహన్‌దాస్, పూర్వ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ ,బి.వి.అప్పారావు, వి.శారదా, నన్నయ్య యూనివర్సిటీ పూర్వ వీసీ ముత్యాల నాయుడు, కల్నల్ ఎ.కె.సుబ్బారావు, అజశర్మ, జయశ్రీ తదితరులు పాల్గొంటారని చెప్పారు.

బాల్య వివాహాలకు వ్యతిరేకంగా మానవహారం

మహారాణిపేట: 'బాల్ వివాహ్ ముక్తి భారత్' కార్యక్రమంలో భాగంగా బుధవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, పర్యవేక్షణ అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు నిర్వహించిన ర్యాలీని జిల్లా మహిళా సంక్షేమ శాఖ పీడీ జి.జయదేవి ప్రారంభించారు. జైలు రోడ్డులోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ నుంచి జగదాంబ సెంటర్ వరకు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీడీపీవోలు జి.శారదాదేవి, రమణికుమారి, శ్రీలత, శ్రీదేవి, పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

హెల్త్ ఎరీనా సందర్శన


హెల్త్ ఎరీనాలో ఎమ్మెల్యే వెలగపూడి తదితరులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్-6ను ఆనుకుని ఉన్న వీఎంఆర్‌డీఏ హెల్త్ ఎరీనాను బుధవారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్‌లు సందర్శించారు. వాకింగ్ చేస్తూ అక్కడి సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వాకర్స్‌తో ముచ్చటించి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారి సూచనలకు అనుగుణంగా పలు సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. పలు పరికరాలు మరమ్మతులను త్వరితగతిన పూర్తిచేసి వాకర్స్‌కు అందుబాటులోకి తేవాలని సూచించారు. పలువురు అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి సుస్తీ


పెదవాల్తేరులోని ప్రాంతీయ ప్రజారోగ్య ప్రయోగ శాల, ఉప సంచాలకుల వారి కార్యాలయం


బహిరంగ ప్రదేశంలో పాన్ మసాల డబ్బాలు

- అపరిశుభ్రతకు నిలయంగా ప్రాంతీయ ప్రజారోగ్య ప్రయోగ శాల
- ఎక్కడ చూసినా మద్యం బాటిళ్లు, గుట్కా, ఖైనీ ప్యాకెట్లే..
- అధికారుల నిర్లక్ష్యం.. ఫుడ్ కంట్రోల్ కార్యాలయానికి శాపం

బీచ్‌రోడ్డు: ప్రజలకు ఆరోగ్యకరమైన, శుచికరమైన ఆహారం అందిస్తున్నారా.. లేదా అని తనిఖీలు చేసే ఫుడ్ కంట్రోల్ కార్యాలయమే అపరిశుభ్రతకు నిలయంగా మారింది. పెదవాల్తేరులోని ప్రాంతీయ ప్రజారోగ్య ప్రయోగ శాల ప్రాంగణంలో ఎక్కడ చూసినా తాగి పడేసిన మద్యం సీసాలు, గుట్కా, ఖైనీ ప్యాకెట్లే దర్శనమిస్తున్నాయి. ఈ ప్రాంగణంలోనే ఉప సంచాలకుల వారి కార్యాలయం, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోల్ ఆఫీస్ ఉన్నాయి. ఇప్పటికే సరైన శుభ్రత లేక అధ్వానంగా కనిపిస్తున్న కార్యాలయ పరిసరాలు.. మద్యం సీసాలు, గుట్కా ప్యాకెట్లతో నిండి బూత్ బంగ్లాలా తయారైంది. ఈ కార్యాలయ ప్రాంగణంలోనే త్వరలో రాష్ట్ర ఆహార పరీక్ష కేంద్రం కూడా ప్రారంభం కానుంది. ఇంతటి ముఖ్యమైన కార్యాలయాలకు కేంద్రమైన ఈ ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఉద్యోగుల నిర్లక్ష్యం వల్లే కార్యాలయ బహిరంగ ప్రదేశంలో పెద్ద మొత్తంలో గుట్కా, ఖైనీ ప్యాకెట్లు పేరుకుపోయాయి. ఈ కార్యాలయ శుభ్రతను ఎవరూ పట్టించుకోవడం లేదు.

ముఖద్వారం నుంచే మొదలు..

ఫుడ్ కంట్రోల్ కార్యాలయ ముఖద్వారం వద్దే పదుల సంఖ్యలో తాగి పడేసిన మద్యం, బీరు సీసాలు దర్శనమిస్తునాయి. ఇక లోపలికి వెళ్తే ఎక్కడ చూసినా అవే కనిపిస్తాయి. ఇక్కడ మద్యం సీసాలను ఎవరు పడేస్తున్నారో తెలియాల్సి ఉంది. తనిఖీలు సమయంలో పట్టుకున్న గుట్కా, ఖైనీ


కార్యాలయ ముఖద్వారం వద్ద తాగి పడేసిన మద్యం సీసాలు


కార్యాలయ ప్రాంగణంలో గుట్కా, ఖైనీ ప్యాకెట్లు

ప్యాకెట్లు, ఇతర పాన్ మసాలు వంటి వాటిని సిబ్బంది నిర్లక్ష్యంగా బహిరంగ ప్రాంతాల్లో పడవేస్తున్నారు. వీటిని ప్రజలు చూసి వినియోగిస్తే వారి ఆరోగ్యానికి ముప్పు కలగవచ్చు. పశువులు వీటిని తింటే మరణించే అవకాశముంది. ఇంతటి ప్రమాదకరమైన పదార్థాలను బహిరంగ ప్రదేశాల్లో పడేయడమేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఉన్నతాధికారులు స్పందించాలి

ఈ కార్యాలయంలో మధ్యాహ్నం నుంచి ఉన్నతాధికారుల ఆచూకీ కనిపించదు. కేవలం దిగువ స్థాయి అధికారులు మాత్రమే కొంత మంది ఉంటారు. వారు కూడా తమకు ఏమీ పట్టనట్లు వ్యవహిస్తున్నారు. ఈ కార్యాలయం అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ అధీనంలో ఉంటుంది. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు ఫోన్ చేసినా స్పందన ఉండటం లేదు. కల్తీ ఆహారం కోసం సమాచారమిచ్చే వారు, ఫిర్యాదు చేసే వారు ఎలా సంప్రదిస్తారనేది పెద్ద ప్రశ్నగా మిగిలింది.ఇక్కడ పరిస్థితులపై సంబంధిత ఉన్నతాధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విమ్స్ ఉద్యోగుల దాతృత్వం


విమ్స్ డైరెక్టర్ రాంబాబు చేతుల మీదుగా బాలుకు నగదు అందిస్తున్న తోటి ఉద్యోగులు

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో పనిచేస్తున్న ఉద్యోగులు తోటి ఉద్యోగికి ఆర్థిక సహకారం అందించారు. ఉద్యోగి కుమారుడి వైద్యం కోసం తమ వంతు సాయం చేసి దాతృత్వం చాటారు. విమ్స్‌లో ఎంఎన్‌వోగా పని చేస్తున్న బాలు కుమారుడు అంతుచిక్కని వ్యాధితో బాధపడుతున్నాడు. దేశంలోని పలు ఆస్పత్రుల్లో చూపించినా వ్యాధి నయం కాలేదు. అప్పటికే రూ.లక్షల్లో ఖర్చు చేయడంతో బాలు ఆర్థిక ఇబ్బందులకు గురయ్యాడు. వెల్లూరులోని సీఎంసీ వైద్యశాలకు కుమారుడిని తీసుకెళ్లనున్న బాలుకు తోటి ఉద్యోగులు అండగా నిలిచారు. అందరూ కలిసి రూ.1.30 లక్షలు సేకరించి బుధవారం విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు చేతుల మీదుగా బాలు కుటుంబానికి అందజేశారు. దీంతో వారికి బాలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రాంబాబు మాట్లాడుతూ ఇబ్బందుల్లో ఉన్న తోటి ఉద్యోగికి సహాయం చేసి మానవత్వం ప్రదర్శించారని సిబ్బందిని అభినందించారు. దాతలు ముందుకొచ్చి బాలు కుమారుడి వైద్యం కోసం ఆర్థిక సాయం చేయాలని కోరారు. సహాయం చేయదలచిన వారు 93986 09381 నంబర్‌లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో విమ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతోనే వ్యవసాయం బాగు


మాట్లాడుతున్న ఆచార్య నాగేశ్వరరావు


దేశీయ విత్తనాల ప్రదర్శన

విశాఖ విద్య: రైతులు, రైతు కూలీల మధ్య సమన్వయంతోనే వ్యవసాయం బాగుంటుందని ఏయూ మాజీ వీసీ ఆచార్య జి.నాగేశ్వరరావు అన్నారు. ఏయూ సైకాలజీ విభాగంలో బుధవారం నిర్వహించిన సోషియో ఎకనామిక్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ల్యాండ్లెస్ అగ్రికల్చరల్ లేబరర్స్ సదస్సును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతు కూలీల మానసిక సన్నద్ధత, స్థైర్యాన్ని పెంచేలా ప్రతీ ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరముందన్నారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వి.ఆర్.రాజు మాట్లాడుతూ రైతులు, రైతు కూలీల్లో ఆర్థిక, మానసిక సమస్యలు పెరిగిపోతున్నాయని చెప్పారు. సమాజంలో రైతులు, భూమిలేని రైతు కూలీలు కూడా ఎంతో కీలకమన్నారు. ఆగ్రో ఎకనామిక్స్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ లిల్లీ గ్రేస్ మాట్లాడుతూ రైతు కూలీలకు సంప్రదాయమైన, ఆధునిక సవాళ్లు ఎదురవుతున్నాయని చెప్పారు. సామాజిక సమరస్తా ఆల్ ఇండియా కన్వీనర్ శ్యాం ప్రసాద్, సిఫ డైరెక్టర్ డాక్టర్ శశిప్రభా తదితరులు ప్రసంగించారు. సదస్సులో భాగంగా 300కు పైగా దేశీయ విత్తనాలను ప్రదర్శించారు.

డ్రాయింగ్ పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ


సర్టిఫికెట్, మెమెంటో అందుకుంటున్న గురుకుల విద్యార్థి, ఆర్ట్ టీచర్

విశాఖ విద్య: సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు, కళాశాలల రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్, ఆర్ట్ పోటీలు గుంటూరు జిల్లాలో నిర్వహించారు. శ్రీకృష్ణాపురం గురుకులం విద్యార్థులు కె.రాజ్‌కుమార్(ఫస్టియర్ ఎంపీసీ), ఎల్.కార్తీక్ (సెకండియర్ ఎంపీసీ) ఉమ్మడిగా డ్రాయింగ్ పోటీల్లో పాల్గొని ప్రథమ బహుమతి పొందారు. వీరిని సర్టిఫికెట్, మెమెంటోలతో నిర్వాహకులు సత్కరించి రూ.10 వేలు నగదు బహుమతి అందించారు. ఆర్ట్ టీచర్ పి.సుధాకర్ వీరికి తర్ఫీదు ఇచ్చారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి రావడానికి కృషి చేసిన డ్రాయింగ్ మాస్టార్ పి.సుధాకర్‌ను సంస్థ ఉన్నతాధికారులు సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను గురుకులాల జిల్లా సమన్వయకర్త రూపవతి, ప్రిన్సిపాల్ రత్నవల్లి, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది అభినందించారు.

ఆక్రమిత స్థలం స్వాధీనం


పార్వతీనగర్‌లో జీవీఎంసీ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక ఫ్లెక్సీ

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు పార్వతీనగర్‌లో గెడ్డ అంచున ఆక్రమణకు గురైన స్థలాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇక్కడ రోడ్డు విస్తరణలో భాగంగా ఇళ్లు, ఇంటి భాగాలు కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయంగా నష్టపరిహారం కోసం జీవీఎంసీ టీడీఆర్‌లు ఇచ్చింది. ఓ వ్యక్తి టీడీఆర్ తీసుకొని తమ ఇంటి భాగంలో రేకులతో షెల్టర్ వేయడంతోపాటు జీవీఎంసీకి చెందిన ఖాళీ స్థలాన్ని ఆక్రమించే ప్రయత్నం చేశాడు. దీన్ని గమనించిన స్థానికులు వారం రోజుల కిందట ఆ స్థలం ఆక్రమణను అడ్డుకుని హడావిడి చేశారు. దీనికి స్పందించిన జీవీఎంసీ అధికారులు బుధవారం సచివాలయ సిబ్బందితో కలిసి ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. 'ఈ భూమి ప్రభుత్వానికి చెందినది. ఎవరైనా ఆక్రమించినచో శిక్షార్హులు–జిల్లా కలెక్టర్' అని హెచ్చరిస్తూ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

తోటగరువు హైస్కూల్‌ను సందర్శించిన డిప్యూటీ డీఈవో


తోటగరువు హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో, ఎంఈవోలు

ఆరిలోవ: తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలపై విద్యా శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ పాఠశాలలో మధ్యాహ్నం భోజనం సరకులు పక్కదారి పడుతున్న వైనంపై 'సాక్షి'లో వెలువడిన కథనానికి కలెక్టర్ హరేందిర ప్రసాద్ స్పందించి డీఈవో ప్రేమ్‌కుమార్, మిడ్ డే మీల్ అధికారులతో కలిసి మంగళవారం పాఠశాలను సందర్శించిన విషయం తెలిసిందే. వంటశాలతోపాటు పరిసరాల అపరిశుభ్రతపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా కలెక్టర్ దృష్టికి చేరిన ఈ పాఠశాలపై విద్యా శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ఇందులో భాగంగా బుధవారం డిప్యూటీ డీఈవో సోమేశ్వరరావు ఎంఈవోలు రవీంద్రబాబు, అనురాధతో కలిసి బుధవారం పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజనాల కోసం వండిన వంటకాలను పరిశీలించారు. కలెక్టర్ సూచనల మేరకు పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచారో లేదో గమనించారు. మధ్యాహ్న భోజన పథకంలో అవకతవకలు లేకుండా సక్రమంగా అమలు చేయాలని ఉపాధ్యాయులకు డిప్యూటీ డీఈవో సూచించారు.

అక్రమ నిర్మాణంపై కొరడా


ఇందిరానగర్‌లో అనధికార అంతస్తు గోడలు తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు ఇందిరాగాంధీ నగర్‌లో రామాలయం ఎదురుగా అనధికారికంగా చేపట్టిన నిర్మాణంపై జోన్–2 టౌన్ ప్లానింగ్ అధికారులు కొరడా ఝులిపించారు. ఇక్కడ 8 అడుగులు వెడల్పు గల ఇరుకు రోడ్డు పక్కన సుమారు 160 చదరపు గజాల విస్తీర్ణంలో ఓ వ్యక్తి స్థానిక టీడీపీ నాయకుల అండతో దర్జాగా అనధికారిక అంతస్తులు నిర్మించారు. అతడు జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారుల నుంచి నిర్మాణం కోసం అనుమతులు తీసుకొని అనధికారికంగా మరో రెండు అంతస్తులు నిర్మించాడు. దీనిపై ఫిర్యాదులు అందడంతో పాటు గత సెప్టెంబర్ 21న 'సాక్షి'లో వెలువడిన కథనానికి ఎట్టకేలకు జీవీఎంసీ అధికారుల్లో కదలిక వచ్చింది. జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఆదేశాలతో బుధవారం జోన్–2 టౌన్ ప్లానింగ్ ఏసీపీ ఎం.తిరుపతిరావు, టీపీవో బాలరాజు సిబ్బందితో అనధికారిక అంతస్తుల తొలగింపు చర్యలు చేపట్టారు. ఒక అంతస్తులో గోడలు, మరో అంతస్తులో శ్లాబ్‌ను తొలగించారు.

10వ వార్డులో షాడో కార్పొరేటర్ హవా!


యూపీహెచ్‌సీలో షాడో కార్పొరేటర్‌కు వినతిపత్రం అందిస్తున్న వైద్య సిబ్బంది

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డులో ప్రజలకు కార్పొరేటర్ ఎవరనే దానిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా వార్డుకు ఒక్కరే కార్పొరేటర్ ఉంటారు. ఈ వార్డులో మాత్రం ఇద్దరున్నారు. వారిలో ఒకరు ప్రజలు నేరుగా ఎన్నుకున్న మహిళ కాగా.. మరొకరు ఆమె భర్త షాడో కార్పొరేటర్‌గా చలామణి అయిపోతున్నారు. కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి ఎక్కువగా ప్రజల మధ్యకు రావడం లేదు. దీంతో ఆమె భర్త రాజశేఖర్ ఏవైనా కార్యకలాపాలకు హాజరు కావడం, ప్రభుత్వ కార్యాలయాల పరిశీలనకు వెళ్తూ కార్పొరేటర్‌గా హడావుడి చేసేస్తున్నారు. దీంతో ఎవరు కార్పొరేటరో తెలియక ప్రజలు అయోమయంలో పడుతున్నారు. వివేకానందనగర్‌లో వినాయక గుడి ఎదురుగా ఉన్న యూపీహెచ్‌సీ బుధవారం తనిఖీకి ఆయన వెళ్లి ఫార్మసీ, ఏపీ పరిశీలించారు. ఆయనే కార్పొరేటర్‌గా భావించిన అక్కడ వైద్య సిబ్బంది వారి సమస్యలపై అతడికి వినతిపత్రం అందించడం విశేషం. వార్డులో కార్పొరేటర్ ఎవరన్న విషయం కూడా కనీసం తెలియని పరిస్థితిలో ఆస్పత్రి సిబ్బంది ఉండటంపై స్థానికులు విస్తుపోతున్నారు. ఎవరైనా ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది తమ సమస్యలపై ఉన్నతాధికారులకో, లేదంటే అందుబాటులో ఉన్న ప్రజాప్రతినిధులకో వినతిపత్రాలు అందజేస్తారు. ఇక్కడ వైద్య సిబ్బంది మాత్రం వాటితో సంబంధం లేని వ్యక్తికి వినతిపత్రం ఇవ్వడం విశేషం.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ర్యాలీ


ఇసుకతోట కూడలిలో ర్యాలీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు, విద్యార్థులు

మద్దిలపాలెం: ఇసుకతోటలోని ఓ ప్రైవేట్ స్కూల్ విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించిన వారికి విద్యార్థులు గులాబీలు, చాక్లెట్లు పంపిణీ చేసి భద్రతా నియమాలు, ప్రమాదాల గురించి వివరించారు. తొలుత పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎంవీపీ పోలీస్ స్టేషన్ ట్రాఫిక్ ఎస్‌ఐ కనకరాజు, సిబ్బంది నాగేశ్వరరావు ట్రాఫిక్ భద్రతా నియమాల గురించి తెలియజేశారు. అనంతరం ఇసుకతోట కూడలిలో విద్యార్థులతో కలిసి ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ కనకరాజు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి సమాజ సేవ, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలగాలనే సదుద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, ప్రమాదాల నియంత్రణకు సహకరించాలని కోరారు. హెల్మెట్ ధరించి సురక్షిత ప్రయాణం చేయాలని సూచించారు.

'భవన నిర్మాణ పాలసీలను స్వాగతిస్తున్నాం'


సమావేశంలో పాల్గొన్న ఆర్కిటెక్ట్‌లు

బీచ్‌రోడ్డు: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ నూతన భవన నిర్మాణ పాలసీలను స్వాగతిస్తున్నామని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్కిటెక్ట్స్ సంఘం(ఐఐఏ) చైర్మన్ రాజేష్ తెలిపారు. నగరంలోని ఒక హోటల్‌లో బుధవారం నిర్వహించిన ఐఐఏ సమావేశంలో నూతన పాలసీలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్కిటెక్ట్‌లు తమను బాధ్యత గల కన్సల్టెంట్లుగా నిరూపించుకోవడంపై కట్టుబడి ఉన్నామన్నారు. తదుపరి చర్చల్లో నూతన మార్గదర్శకాలను అమలు చేయడానికి సంబంధించిన లోపాలను లేదా సవాళ్లను గుర్తించడంలో సహకరించడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఆర్కిటెక్ట్ సంఘం హామీ ఇచ్చింది. కార్యక్రమంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్కిటెక్ట్స్ సంఘం కార్యదర్శి ఆర్కిటెక్ట్ రామ్‌జీ ఎ.వూటాడ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా, సైబర్ బుల్లియింగ్‌పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న సైబర్ క్రైం ఎస్‌ఐ రవికిషోర్

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం సోషల్ మీడియా, సైబర్ బుల్లియింగ్ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ క్రైం ఎస్‌ఐ కె.రవికిషోర్ మాట్లాడుతూ విద్యార్థులందరూ సోషల్ మీడియా అప్లికేషన్లు ఉపయోగిస్తున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అడ్వకేట్ సిహెచ్.రాంబాబు మాట్లాడుతూ విద్యార్థులందరూ సోషల్ మీడియాలో పాజిటివ్ పోస్టులు మాత్రమే పెట్టాలని సూచించారు. సైకాలజిస్ట్ జెట్లీ మాట్లాడుతూ మొబైల్ ఫోన్లను అవసరం మేరకు మాత్రమే వినియోగించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు మాట్లాడుతూ విద్యార్థులందరూ సైబర్ హైజీన్ పాటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, అకడమిక్ అడ్వైజర్ డి.శ్రావణ్‌కుమార్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ కె.రవిబాబు, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ఎ.శివప్రసాద్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

9, 12 తేదీల్లో జీవీఎంసీ దుకాణాలకు వేలం

దాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధి జోన్–3, జోన్–4లో వచ్చే నెల 9, 12 తేదీల్లో పలు దుకాణ సముదాయాలు, కల్యాణ మండపం, మార్కెట్లకు బహిరంగ వేలం వేయనున్నట్టు ఆయా జోనల్ కమిషనర్లు కె.శివప్రసాద్, మల్లయ్యనాయుడు ప్రకటనలో పేర్కొన్నారు. జోన్–3 పరిధిలో గల వివిధ వాణిజ్య సముదాయాల్లో ఖాళీగా ఉన్న దుకాణాలు మూడేళ్ల కాల పరిమితికి కాంట్రాక్ట్‌కు ఇచ్చేందుకు వచ్చే నెల 12న ఆశీల్‌మెట్ట, జోన్–3 కార్యాలయంలో ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు జోనల్ కమిషనర్ శివప్రసాద్ తెలిపారు. జోన్–4 పరిధిలో గల డైక్స్ ట్యాంక్ వాణిజ్య సముదాయం గ్రౌండ్‌ఫ్లోర్‌లో 9, 10, 11, 12, 13 (జనరల్), 15 (ఎస్సీ)కి మొదటి అంతస్తులో దుకాణం నంబరు 2 (ఎస్సీ), 3, 4, 5, 6, 7, 9, 10, 11, 12, 13, 14, 15 (జనరల్)కు అలాగే జగదాంబ జీవీఎంసీ వాణిజ్య సముదాయంలో దుకాణం నంబర్లు 3, 5, 13, 14 (ఎస్టీ)కి, పాతబస్టాండ్ ఫేస్–2లో 1,2,3,4,5,6,7, 8,10,11,13,14 (ఎస్సీ)కి, దుకాణం నంబరు 9 (ఎస్టీ)కి కేటాయించబడినవని, 39వ వార్డు పద్మానగర్ వాణిజ్య సముదాయంలో గల దుకాణాలు 1, 4, 6, 7, 11, 12 (జనరల్), 8 (ఎస్సీ)కి, 31వ వార్డు సూర్యాబాగ్ వాణిజ్య సముదాయం (జోన్–4 కార్యాలయ సమీపాన)లో ఫస్ట్‌ఫ్లోర్‌లో దుకాణం నంబరు 9, 37వ వార్డు రెల్లివీధి అంబేడ్కర్ కల్యాణ మండపం, రామకృష్ణా రైతు మార్కెట్, రెల్లివీధి రోడ్డు సైడ్ మార్కెట్లు కాంట్రాక్ట్‌కు ఇచ్చేందుకు వచ్చే నెల 9న సూర్యాబాగ్‌లో గల జోనల్ కార్యాలయంలో ఆ రోజు ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు తెలిపారు. మరిన్ని వివరాలకు ఆయా జోనల్ కార్యాలయాల్లో కార్యాలయ పని దినాల్లో పర్యవేక్షకులను సంప్రదించాలని తెలిపారు.

అయ్యప్ప నిత్యాన్నదానానికి రూ.3 లక్షల విరాళం


దాత కంచర్ల ఉపేంద్రను సత్కరిస్తున్న అన్నదాన నిర్వాహకుడు

మద్దిలపాలెం: అయ్యప్ప స్వాములతోపాటు వివిధ రకాల మాలధారులకు అన్నదానం చేస్తున్న ఎరిమేలి అయ్యప్ప అన్నసమారాధన సేవా ట్రస్ట్‌కు ఉపకార్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ కంచర్ల అచ్యుతరావు తనయుడు, సినీ హీరో కంచర్ల ఉపేంద్ర బాబు రూ.3 లక్షల విరాళం అందించి తన ఉదారత చాటుకున్నారు. బుధవారం ఉదయం ట్రస్టు సభ్యులకు రూ.3 లక్షలను చెక్కు రూపంలో ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఉపేంద్ర మాట్లాడుతూ తన తండ్రి కంచర్ల అచ్యుతరావు అనుసరిస్తున్న సేవా స్ఫూర్తితో తాను ముందుకు సాగుతున్నానన్నారు. ఇటువంటి బృహత్తరమైన ఆధ్యాత్మిక కార్యక్రమంలో తాము పాలుపంచుకునే భాగ్యం కలుగడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఎరిమెలి అయ్యప్ప సేవా ట్రస్ట్ సేవలను కొనియాడారు. ట్రస్ట్ సభ్యులు దాత ఉపేంద్రకు కృతజ్ఞతలు తెలిపి సత్కరించారు.

'ఎల్వీపీ'లో వీడియో చిత్రీకరించిన వ్యక్తి అరెస్ట్

ఆరిలోవ: హనుమంతవాక వద్ద ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో బాత్‌రూమ్‌కు వెళ్లిన మహిళ వీడియో తీసిన వ్యక్తిని ఆరిలోవ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి సీఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలిలా.. ఆస్పత్రిలో వైద్యం కోసం వెళ్లిన ఓ మహిళను కాకినాడకు చెందిన జి.రవికుమార్ మంగళవారం వీడియో చిత్రీకరించాడు. దాన్ని గమనించిన అక్కడ సెక్యూరిటీ సిబ్బంది అతడిని పట్టుకుని సెల్‌ఫోన్ తీసుకొని తీసిన వీడియో డిలీట్ చేసినట్లు తెలిసింది. దీనిపై ఆస్పత్రి ఏవో శ్రీదేవి ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి వీడియో చిత్రీకరించిన రవికుమార్‌ను బుధవారం అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.